## బీజేపీఎల్పీ నేత ఎవరు?

- ఎమ్మెల్యే రాజాసింగ్, రాష్ట్ర నాయకత్వం మధ్య సైలెంట్ వార్
- కొత్తవారి వైపు నాయకత్వం మొగ్గు

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): బీజేపీ శాసనసభాపక్ష నేత ఎవరు? అసెంబ్లీ సమావేశాలు మొదలైనా ఇంకా ఆ పార్టీలో ఈ ప్రశ్నకు సమాధానం రావడం లేదు. ఈ విషయంలో రాష్ట్ర నాయకత్వం, హ్యాట్రిక్ ఎమ్మెల్యే రాజాసింగ్ మధ్య సైలెంట్ వార్ జరుగుతున్నట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఎనిమిది మందిలో తానొక్కడినే సీనియర్ అని, వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను కాబట్టి తనకే ఆ పదవి ఇవ్వాలని రాజాసింగ్ పట్టుబడుతున్నారు. అయినా బీజేపీ రాష్ట్ర నాయకత్వం రాజాసింగ్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఆయనకు తెలుగు స్పష్టంగా రాకపోవడం ఒక అడ్డంకి కాగా, తరుచూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వివాదాల్లో ఇరుక్కునే స్వభావం మరో అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో రాజాసింగ్‌కు ఫ్లోర్‌లీడర్ అప్పగిస్తే.. రాజకీయంగా ఇబ్బందులు వస్తాయని నాయకత్వం భావిస్తున్నది. ఈ సారి కొత్తవారికి అవకాశం ఇద్దామని ఆలోచిస్తున్నది. కామారెడ్డిలో గెలిచిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేరు తెర మీదికి వచ్చింది. మరికొందరు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డివైపు మొగ్గుచూపుతున్నారు. వయసులో పెద్దవాడైన ముథోల్ ఎమ్మెల్యే రామ్‌రావ్ పవార్ పేరును తెరపైకి తెచ్చినా.. ఆయనకు భాష సమస్య ఎదురవుతున్నది. ఈ నేపథ్యంలో మహేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డిల్లో ఎవరో ఒకరికి ఫ్లోర్‌లీడర్ పదవి దక్కే అవకాశం ఉన్నదని సమాచారం.

# బీజేపీ ఆర్డినెన్స్‌కు కాంగ్రెస్ మద్దతు

- విలీన మండలాల ప్రజలను తీవ్రంగా మోసం చేసిన జాతీయ పార్టీలు
- లోక్‌సభలో ఎంపీలమంతా నినదించాం
- జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- తెలంగాణభవన్‌లో బీ వినోద్‌కుమార్



హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నుంచి ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరించిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు స్వీకరించిన తరువాత టీడీపీ కోసం దొడ్డిదారిలో విలీన మండలాల కోసం ఆర్డినెన్స్ తీసుకొచ్చారని, దానికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని దుయ్యబట్టారు. ఈ రెండు జాతీయ పార్టీలు తెలంగాణ ప్రజలను మోసం చేశాయని మండిపడ్డారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. నాడు తెలంగాణ నుంచి ఏడు మండలాలను ఏపీలో విలీనం చేస్తుంటే, బీఆర్‌ఎస్ నాయకులు మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నాడు అసెంబ్లీలో, పార్లమెంట్‌లో అలుపెరగని పోరాటం చేశామని చెప్పారు. 2014లో జూలైలో జరిగిన పార్లమెంట్ సమావేశాల కంటే ముందే.. మే 29న బీజేపీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని వివరించారు. విలీన ప్రక్రియను నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఎంపీలు లోక్‌సభలో మాట్లాడారని తెలిపారు. ఈ సందర్భంగా తాము లోక్‌సభలో విలీన మండలాల ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ చేసిన వ్యాఖ్యల వీడియోను ప్రదర్శించారు. వాటిని లైవ్‌లోనే జీవన్‌రెడ్డికి పంపారు. బీజేపీ, టీడీపీ పొత్తులో భాగంగా పోలవరానికి మేలు చేసేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను విలీనం చేశారని పేర్కొన్నారు. ఈ అనాలోచిత ఆర్డినెన్స్ వల్ల తెలంగాణ 500 మెగావాట్ల సీలేరు విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని కోల్పోయిందని వివరించారు.

**బంద్‌లు చేసిందే బీఆర్‌ఎస్..**

మండలాల విలీనాలను వ్యతిరేకిస్తూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో టీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బంద్ పాటించామని వినోద్‌కుమార్ చెప్పారు. నాడు భద్రాచలంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా బంద్‌కు మద్దతు తెలుపలేదని విమర్శించారు. లోక్‌సభలో బిల్లు ఆమోదించుకున్న బీజేపీ, కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని రాజ్యసభలోనూ ఆమోదించారని చెప్పారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టీడీపీలో ఉన్నారని, తన గురువు చంద్రబాబు చెప్పిన విధంగా మద్దతు తెలిపారని అన్నారు. అలాంటి కాంగ్రెస్ నేతలు ఆనాడు బీఆర్‌ఎస్ మౌనంగా ఉన్నదని చెప్పడం విడ్డూరమని మండిపడ్డారు.

**ప్రజలతోనే గులాబీ జెండా**

గెలుపు, ఓటములు శాశ్వతం కాదని.. సూర్యుడు, భూమి ఉన్నంతకాలం గులాబీ జెండా తెలంగాణ ప్రజల పక్షానే కొట్లాడుతుందని వినోద్‌కుమార్ చెప్పారు. బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రాజెక్టులకు జాతీయ హోదా తీసుకొనిరాలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కేసీఆర్ వందల లేఖలు రాసినా, పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఎంపీలు కొట్లాడినా కేంద్రం మొండిగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. తాము పదేండ్లలో చేసిన పనులు, ఇచ్చిన ఉద్యోగాలు, వెలవరించిన నోటిఫికేషన్లు, తీసుకొచ్చిన పెట్టుబడుల గురించి జనవరి తర్వాత క్షుణ్ణంగా వివరిస్తామని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రవీందర్‌రెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అటల్ పెన్షన్‌పై ఎందుకింత నిర్లక్ష్యం?

- మూడేండ్లుగా కోకంట్రిబ్యూషన్ నిధులేవీ?
- లోక్‌సభలో కేంద్రాన్ని ప్రశ్నించిన నామా



హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): అటల్ పెన్షన్ యోజన(ఏపీవై) పథకంపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు విమర్శించారు. పథకం అమలు తీరు, సభ్యుల సంఖ్య పెరుగుదలకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై సోమవారం లోక్‌సభలో నామా ప్రశ్నించారు. అటల్ పెన్షన్ యోజన పథకం నిధుల వివరాలు వెల్లడించాలని కోరారు. ఈ పథకానికి కేంద్రం ఏ మేరకు నిధులు సమకూరుస్తున్నదో తెలపాలని, ఐదేండ్లుగా రాష్ట్రాలకు కేటాయించిన నిధుల వివరాలు కావాలని కోరారు. 2021, 2022, 2023లో పథకానికి ప్రభుత్వ కోకంట్రిబ్యూషన్ నిధులు ఎందుకు కేటాయించలేదని నిలదీశారు. పెన్షన్, ఆస్తుల మధ్య అంతరాన్ని పూడ్చేందుకు ఉద్దేశించిన గ్యాప్‌ఫండ్‌కు కూడా నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి డాక్టర్ భగవత్ కరాద్ సమాధానమిస్తూ.. సభ్యులు ఎంచుకున్న ఆధారంగా కనీస హామీ పెన్షన్‌ను అందిస్తున్నట్టు తెలిపారు. పథకానికి సంబంధించిన కోకంట్రిబ్యూషన్ నిధులు, బ్యాంకులకు ప్రోత్సాహక చెల్లింపులు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రాల వారీగా సమగ్ర సమాచారం ఇవ్వకపోవడంపై ఎంపీ నామా నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## 27 నుంచి సీఎస్‌లతో నీతిఆయోగ్ సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): నీతి ఆయోగ్ సంస్థ ఈ నెల 27 నుంచి అన్ని రాష్ట్రాల సీఎస్‌లతో సమావేశం నిర్వహించనున్నది. 3 రోజులపాటు జరిగే సమావేశాలకు ఢిల్లీలోని పూసా ఇన్‌స్టిట్యూట్ వేదిక కానున్నది. రాష్ట్రాల సీఎస్‌లు హాజరు కావాలని నీతి ఆయోగ్ సీఈవో లేఖలు రాశారు.











